క్లుప్తంగా

మూడు టిప్పర్ల పట్టివేత



శాయంపేట : అనుమతులు లేకుండా మొరం, కంకర తరలిస్తున్న మూడు టిప్పర్ వాహనాలను పట్టుకున్నట్లు విజిలెన్స్ అధికారి హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివారలు ప్రకారం. మండలంలోని మాందారిపేట ప్రధాన రహదారిపై బుధవారం వే బిల్లులు లేకుండా మొరం తరలిస్తున్న రెండు, కంకర తరలిస్తున్న ఒక టిప్పర్ వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వీటిని మైనింగ్ శాఖకు అప్పగిస్తామని పేర్కొన్నారు. మైనింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని హరిప్రసాద్ వెల్లడించారు. అనుమతి లేకుండా మొరం, కంకర తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాయబ్ తహసీల్దార్‌గా ప్రభావతి



శాయంపేట : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా గన్న బోయిన ప్రభావతి బధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ డీటీగా విధులు నిర్వర్తించిన లక్ష్మీనారాయణ మహబూబాబాద్‌కు బదిలీపై వెళ్లారు. కాగా ప్రభావతిని కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

'ఈటల' పరామర్శ



కమలాపూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని శనిగరం గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలు కుటుంబాలను హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. నాయకులు ఈటల భద్రయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ మౌటం రమేష్‌బాబు, గందసిరి రవికుమార్, డాక్టర్ పబ్బు సాంబయ్య, మౌటం మొగిలి, కుల్ల శోభన్, పిల్లి సతీష్, అనుకుంట్ల అరవింద్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో రీసెర్చ్ పేపర్ సమర్పణ

కేయూ క్యాంపస్: మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 9న నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం డాక్టర్ నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ అండ్ మ్యాథ్స్‌మెటిక్స్ ఐకానిస్ మ్యాట్ -23 అనే అంశంపై నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో నరేందర్ తన రీసెర్చ్ పేపర్‌ను సమర్పించారు.

ఈసారి కొత్త నోములు లేవు

కాజీపేట: తిథి నక్షత్రం కలిసి ఉన్నప్పటికీ విశాఖ కార్తె ఉన్నందున ఈ సంవత్సరం దీపావళి పండుగకు కొత్త నోములకు అవకాశం లేదని భద్రకాళి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి, శ్వేతార్క ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య శర్మ అన్నారు. కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది ఏదైనా అశౌచంతో నోము పడిపోయిన వాళ్లు వాకిలి దేవర చేసుకొని నోముకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో విశాఖ కార్తెకు పట్టింపు లేకుండా కొత్త నోము నోముకుంటారని, అది వారివారి ప్రాంతీయ ఆచార, సంప్రదాయాల ప్రకారం నిర్ణయించుకుంటారని స్పష్టం చేశారు. గ్రామ పురోహితుల నిర్ణయాలకు అనుగుణంగా నోముల విషయాన్ని నిర్ధారించుకోవాలని కోరారు.

బీసీ ప్రజా సంఘం అర్బన్ అధ్యక్షురాలిగా దేవిక

హన్మకొండ: తెలంగాణ బీసీ ప్రజా సంఘం హనుమకొండ అర్బన్ ప్రెసిడెంట్‌గా హనుమకొండలోని విజయపాల్‌కాలనీకి చెందిన చెట్టుపెల్లి దేవిక నియమితులయ్యారు. ఈమేరకు గీసుగొండ మండలం ధర్మారంలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమెకు నియామక పత్రాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ అందజేశారు.

పీహెచ్‌డీలో అవకతవకలపై విచారణ జరిపించండి

కేయూ క్యాంపస్: పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను మంగళవారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. కేయూ విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల జన్మిస్తే అదృష్టంగా భావించాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజూల
- ఘనంగా బాలికా దినోత్సవం
- అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన



శాయంపేట : ప్రగతిసింగారం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, చిన్నారులు

శాయంపేట : ఆడపిల్ల జన్మిస్తే తల్లిదండ్రులు అదృష్టంగా భావించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. ఆడపిల్ల ఉంటేనే ప్రతీ ఇంటిలో కల ఉంటుందన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రగతిసింగారం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బేటి బచావో బేటిపడావో కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఆడపిల్ల ఉంటేనే ఇంటికి వెలుగు ఉంటుందన్నారు. ఆడపిల్లలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు బరువుగా కాకుండా అదృష్టంగా భావించాలని సూచించారు. కేవలం ఇంటి పనులకు పరిమితం చేయకుండా ప్రతీ ఆడపిల్లను ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం కోమల, హెచ్ఎం సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, శ్రీలత, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: బాలికల భవిశ్యత్‌కు బంగారుబాట వేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళా, పురుషులు అనే అసమానతలు తొలగించి బాలికల నిష్పత్తి పెరిగే విధంగా కృషిచేయాలని అన్నారు. బాలికలు నైపుణ్యాన్ని పెంపొందించుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఏఎస్సై సిద్ధిరామయ్య మాట్లాడుతూ భ్రూణహత్యలు, బాలికలు, మహిళలు వేధింపులకు గురైతే 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహం జరిపించినట్లయితే చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో పాఠశాల విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఆడపిల్లలు చదువులో ముందుండాలని కోరారు.



బాలికలకు రక్త పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్

ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మంజూల, ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, సుదర్శన్, అంగన్‌వాడీ టీచర్లు కోమల, వనజ, రమాదేవి, సంధ్యారాణి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ప్రగతికి పాటుపడిన సీఈఓ చిన్నారావు



చిన్నారావును సన్మానిస్తున్న రవీందర్‌రావు, డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు

హన్మకొండ: వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారిగా చింతలపూడి చిన్నారావు కర్తవ్య దీక్షతో పని చేశారని ఆ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ప్రశంసించారు. మూడేళ్ల కాలపరిమితితో నియమితులైన చిన్నారావు.. కాల పరిమితి ముగియడంతో హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బుధవారం వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ డీసీసీబీ అభివృద్ధికి, అత్యధిక లాభాలు సాధించేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారని తెలిపారు. అధికారులు, ఉద్యోగుల సమన్వయం, సహకారాలతో బ్యాంకు వ్యాపారాభివృద్ధి సాధించినట్లు చెప్పారు. అధికారులు, ఉద్యోగులు బ్యాంకు ప్రగతిని ఇలాగే ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారావును డీసీసీబీ పాలక వర్గం, అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. బ్యాంకు డైరెక్టర్లు జగన్‌మోహన్ రావు, రమేష్, మురళీధర్, నాబార్డు డీడీఎంలు చంద్రశేఖర్, రవి, ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ కృష్ణ, డీసీసీ జనరల్ మేనేజర్ శ్రీధర్, డీజీఎంలు రోహిణి, దమయంతి, కురువా, ఏజీఎంలు రాజశేఖర్, నవీన్, రాధిక, ఉద్యోగుల యూనియన్ ప్రెసిడెంట్ రజిత, జనరల్ సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

'జంగా'ను విమర్శించే స్థాయి మర్రికి లేదు



మాట్లాడుతున్న కార్పొరేటర్ రవీందర్‌యాదవ్

కాజీపేట అర్బన్: నిత్యం ప్రజల్లో ఉండే జంగా రాఘవరెడ్డిని విమర్శించే స్థాయి ప్రజాదరణ లేక నామినేటెడ్ పోస్టు తీసుకున్న మర్రి యాదవరెడ్డికి లేదని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని పశ్చిమ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ రవీందర్‌యాదవ్ మాట్లాడారు. పశ్చిమలో ఓటమి భయం పట్టుకున్న వినయ్‌భాస్కర్ రాసి ఇచ్చిన స్క్రిప్ట్‌ను మర్రి చదవడం శోచనీయమని అన్నారు. పశ్చిమ ఎన్నికల్లో జంగా విజయం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, విజయ్‌కుమార్, సాగర్, మహేందర్‌రెడ్డి, కోటి పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీని విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: బీఆర్.అంబేడ్కర్ అతిపెద్ద విగ్రహాన్ని అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఈనెల 14న ఆవిష్కరించనున్నారు. స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ పేరుతో 19 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నారు. అంబేడ్కర్ మేధస్సును అమెరికా ప్రభుత్వం గుర్తించి ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించబోతున్నందుకు కృతజ్ఞతగా సంఘీభావం తెలుపుతూ ఈనెల 13న జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో సంఘీభావ బైక్ ర్యాలీ నిర్వహించబోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు వరంగల్ ఎంజీఎం సెంటర్ నుంచి కాజీపేట రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు బాబురావు, బాధ్యులు రామచంద్రరావు, వెంకటేశ్వర్లు, జెట్టి రాజేందర్, మేడ రంజిత్, రవికుమార్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్

హన్మకొండ: బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ తాళ్లపల్లి సురేష్ గౌడ్‌ను నియమించారు. హైదరాబాద్‌లో సురేష్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ నియామక ఉత్తర్వులను బుధవారం అందజేశారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల వాహనాలు తనిఖీ
- ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు



ధర్మసాగర్ : ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ



ధర్మసాగర్ : ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ధర్మసాగర్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా పోలీస్‌లు వాహన తనిఖీలు చేపడుతూ ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మండలంలోని కరుణాపురం జాతీయ రహదారిపై బుధవారం సీఐ శ్రీధర్‌రావు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి స్టేషన్ ఘన్‌పూర్ నుంచి హనుమకొండ వైపు వెళ్తుండగా కడియం వాహనాన్ని తనిఖీ చేశారు. అదే విధంగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వాహనాన్ని సైతం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో మడికొండ సీఐ వేణు, వేలేరు ఎస్సై హరిత, దివ్య, ఏఎస్సై పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో భీమదేవరపల్లి మండలం వంగర పీఎస్ పరిధిలోని రామ్‌నగర్‌లో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు, ఓటర్లను మభ్యపెట్టే వస్తువులు రవాణా చేసినట్లతై వెంటనే వాహనాలను సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు.



దామెరలో వాల్‌రైట్స్ చెరిపివేస్తున్న జీపీ సిబ్బంది



ఎల్కతుర్తిలో..

దామెరలో..

దామెర: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మండల వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగించడంతో పాటు వాల్‌రైటింగ్స్‌లను జీపీ సిబ్బంది బుధవారం చెరిపివేశారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలుంటాయని అన్నారు. ప్రైవేటు వ్యక్తుల ఇళ్లపై ఉన్న వివిధ పార్టీలకు చెందిన ప్రచార రాతలు ఈ నెల 12వ తేదీలోగా చెరిపివేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ రంగాచారి, పంచాయితీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, జీపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలవ్వడంతో అధికారులు ఆయా పనులపై దృష్టి సారించారు.



శాయంపేటలో వాల్‌పోస్టర్‌ను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

బుధవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్‌రైటింగ్స్‌లను తొలగించారు. ఎన్నికల కోడ్‌ను పకబ్బందీగా అమలు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

పింగిళి విద్యార్థినికి సెంట్రల్ వర్సిటీలో సీటు



మేఘనను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హన్మకొండ అర్బన్: నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) ఫైనల్ ఇయర్ పూర్తిచేసిన రావుల మేఘనకు కర్ణాటకలోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ (ఫిజిక్స్)లో సీటు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం మాజీ ఆఫీసర్లు డాక్టర్ మాధవి, రజిత, అధ్యాపకులు బుధవారం అభినందించారు. అనంతరం మేఘనకు కావాల్సిన పుస్తకాలు, నగదును భౌతిక విభాగం అధినేత డాక్టర్ స్నేహలత అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కంట్రోలర్ రామకృష్ణారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, అధ్యాపకులు సురేష్‌బాబు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ కేడెట్లకు అభినందనలు



కేడెట్లతో ప్రిన్సిపాల్ అరుణ, ఫ్లయింగ్ ఆఫీసర్ ప్రభాకర్

రామన్నపేట: సెప్టెంబర్ 23నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు బెంగళూరు రాష్ట్రంలోని జలహలి ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరిగిన ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంప్‌లో పాల్గొన్న ఎల్‌బీ కళాశాల కేడెట్లు పీ.రాజేశ్వరి, టీ.అక్షిత్‌రాజ్, టీ.శేషును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు, ఫ్లయింగ్ ఆఫీసర్ బీ.ప్రభాకర్ అభినందించారు. ఈ క్యాంపునకు ముందు సికింద్రాబాద్‌లోని బైసన్ ట్రైనింగ్ గ్రౌండ్‌లో కేడెట్లు కఠోర శిక్షణ తీసుకున్నట్లు వారు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ఈ క్యాంపులో వారు పాల్గొనడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. దేశంలోని 17 డైరెక్టరేట్ల నుంచి సుమారు 600మంది కేడెట్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ 6వ స్థానంలో నిలిచినట్లు వివరించారు.

కేసీఆర్ సభను సక్సెస్ చేయాలి

- జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

ఎల్కతుర్తి: ఈనెల 15 వ తేదీన హుస్నాబాద్‌లో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ మహాసభను సక్సెస్ చేయాలని జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేసీఆర్ మహాసభకు మండలం నుంచి 10 వేలకు మించకుండా ప్రజలను తరలించాలని నాయకులకు సూచించారు. అలాగే ఎల్కతుర్తి మండలం సూరారంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్ మాట్లాడారు. ఎల్కతుర్తి మండలం నుంచి సీఎం కేసీఆర్ సభకు 10వేల మంది తరలించి సభను విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనీత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగ రవి, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బూర్గుల రామారావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కడారి రాజు, మాడుగుల కొమురయ్య, కుర్ర సాంబమూర్తి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు గొల్లె మహేందర్, మహేందర్, పాల్గొన్నారు.

జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల పట్టాలివ్వాలి



గ్యారంటీ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

శాయంపేట : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ప్రతీ మండలంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు హామీ నెరవేర్చలేదన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి మిగతా మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులను చిన్నచూపు చూడడం సరికాదన్నారు. నియోజకర్గ వ్యాప్తంగా అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు ఇంటి స్థలంలో పాటు పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గండ్ర సత్యనారాయణరావు నాయకత్వంలో అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డు స్కీంలను మండలంలోని గోవిందాపూర్‌లో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, నాయకులు చిందం రవి, మామిడిపల్లి సాంబయ్య, తడక కుమారస్వామి, రాజకుమార్, రజనీకాంత్, రాజిరెడ్డి, బక్కన్న, శ్రావణ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి



చలివాగు బ్రిడ్జిపై ఆందోళన చేస్తున్న మత్స్యకార్మికులు

శాయంపేట : మత్స్యకారులంతా ఏకమై కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేయించి మత్స్యకారులే చేపలు పట్టే విధంగా సొసైటీ ఏర్పాటు చేకున్నామని, కానీ నూతనంగా ఎన్నికైన చలివాగు ప్రాజెక్టు చైర్మన్ గండి రాజమౌళి కాంట్రాక్ట్ విధానానికి తెరలేపుతూ మత్స్యకారులను మోసం చేస్తున్నాడని మత్స్యకారులు ఆరోపించారు. మండలంలోని చలివాగు బ్రిడ్జిపై బుధవారం మత్స్యకార్మికులు పల్లెబోయిన భాస్కర్, కర్ణాకర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ విధానానికి స్వస్తి పలికి మత్స్యకారులే చేపలు పట్టే విధంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తుంటే చైర్మన్ రాజమౌళి మాత్రం చెరువులో పడవలు దింపి వలలు తీస్తేస్తానని చెప్పడం సరికాదన్నారు. కాంట్రాక్టు విధానానికి నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. మత్స్యకార్మికులకు అన్యాయం చేయొద్దని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించిన కాట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహేందర్, కుమారస్వామి, పైడి, మల్లేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దామెర: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ మండలంలోని పసరగొండలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ప్రతీ కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, గన్ను సతీష్, నాయకులు గంకిడి బుచ్చిరెడ్డి, సూర చందర్, చంద్రకిరణ్, గొల్లపెల్లి గిరిధర్, ఎరుకల దివాకర్, ఐత చేరాలు, మేడిపల్లి శ్రీనివాస్, పెంచాల జగన్, సుధాకర్, బాబు, కుమార్, శ్రీను, బొచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి

- సీఐ మల్లేష్



మాట్లాడుతున్న సీఐ మల్లేష్

శాయంపేట : శాస్త్ర, సాంకేతికతో దూసుకెళ్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు మూఢనమ్మకాలను విడనాడాలని సీఐ మల్లేష్ అన్నారు. మండలంలోని గోవిందాపూర్‌లో బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. బాల్య వివాహాలు, సీసీ కెమెరాలు, గుట్కా, గంజాయి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజలందరూ సాంకేతికత, సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దేవేందర్, కళాబృందం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ పురస్కారానికి ఎంపిక

హన్మకొండ కల్చరల్: రామశర్మ స్మారక సాహితీ పురస్కారానికి హనుమకొండకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, సీకేఎం కళాశాల విశ్రాంత ఉపన్యాసకుడు డాక్టర్ గుంజి వెంకటరత్నం పోలూరి హనుమజ్జాని ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ డాక్టర్ దేవులపల్లి రామానుజరావు శుక్రవారం సాయంత్రం ఆయనకు పురస్కార ప్రదానం చేయనున్నారు.